# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆఖరి విడత లోక్‌సభ ఎన్నికలలో భాగంగా దేశంలోని 57 నియోజకవర్గాలకు రేపు పోలింగ్ జరగనుంది.

- గడచిన అయిదేళ్ళలో బ్యాంకింగ్ రంగంలో పలు కీలక సంస్కరణలను అమలు చేశామని బి జె పి సీనియర్ నాయకురాలు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

- పసి పిల్లలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు స్పష్టం చేశారు.

- దేశంలో నైరుతి ఋతు పవనాల విస్తరణ క్రమంగా సాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================================

దేశంలో ఆఖరి విడత లోక్‌సభ ఎన్నికలు రేపు జరగనున్నాయి. ఏడవ దశగా సాగే ఈ పోలింగ్ లో ఏడు రాష్ట్రాలు ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 57 పార్లమెంటరీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్‌లోని ఎంపీ సీట్లతో పాటుగా, కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో ఒక ఎంపీ సీటు ఉంది. రేపటి లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 904 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

==================================

గత అయిదేళ్ళలో దేశంలోని బ్యాంకింగ్ రంగం ప్రగతి బాటన సాగిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ మేరకు ఆమె ఈ రోజు సామాజిక మాధ్యమం ద్వారా చేసిన ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్ రంగంలో సమగ్రమైన దీర్ఘకాలిక సంస్కరణలను తీసుకొచ్చిందని వివరించారు. బాధ్యతాయుత

రుణ వితరణ, సుపరిపాలన వంటి కీలక సంస్కరణలను తీసుకు వచ్చామని పేర్కొన్నారు. దీని వలన పేదలు, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరిందని నిర్మలా సీతారామన్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పసి పిల్లల్ని విక్రయించిన వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. దేశంలోని ప్రధాన నగరాలే కేంద్రాలుగా పసి పిల్లలను విక్రయిస్తున్న అంతరాష్ట్ర మధ్యవర్తుల ముఠాను పోలీసు అధికారులు పట్టుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాష్ట్ర పోలీస్ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి నివేదికను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా జస్టిస్ ఎవి శేష సాయి అందించిన సేవలు ప్రశంస నీయమైనవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు. శేష సాయి పదవీ విరమణ సందర్భంగా ఈ రోజు హైకోర్టులో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, జస్టిస్ ఎవి శేషసాయి న్యాయమూర్తిగా తన కేరీర్ లో సుమారు 23 వేల కేసులను పరిష్కరించడం జరిగిందని గుర్తు చేశారు. జస్టిస్ ఎవి శేషసాయి మాట్లాడుతూ, న్యాయ మూర్తిగా తాను పదవీ విరమణ చేస్తున్నప్పటికీ భవిష్యత్తులో కూడా న్యాయ వ్యవస్థ గురించే తాను ఎక్కువగా ఆలోచిస్తానని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులోని కన్యాకుమారిలో వివేకానందుని స్మారకం వద్ద నిన్న చేపట్టిన ధ్యానం ఈ రోజు కూడా కొనసాగింది. రేపు సాయంత్రం వరకూ ప్రధాని ధ్యానం కొనసాగుతుంది. ఎన్నికల ప్రచారం ముగించుకుని నిన్న కన్యాకుమారి ప్రాంతానికి ప్రధాని చేరుకున్న సంగతి తెలిసిందే.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చిత్తూరు జిల్లాలో రెండు లక్షల 72 వేల 223 మంది లబ్దిదారులకు సుమారు రూ.79.66 కోట్ల రూపాయల సామాజిక పెన్షన్లను రేపటి నుండి పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలయకు రానవసరం లేకుండా పెన్షన్ ను బ్యాంక్ ఖాతాలకు జమ చేయనున్నట్లుగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బి జె పి సీనియర్ నా యకులు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ రోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అమిత్ షా దంపతులకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా టిటిడి ఈవో ఏవీ ధర్మారెడ్డి అమిత్ షా దంపతులను సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని సబ్ డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రో ప్రియట్ అధారిటీ అధికారి డాక్టర్ భాను నాయక్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పి సి పి ఎన్ డి టి జిల్లా సలహా కమిటీ సమావేశం డాక్టర్ కె భాను నాయక్ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉందా లేదా ఏమైనా అంగవైకల్యాలు

ఉన్నాయా అని మాత్రమే స్కానింగ్ ద్వారా తనిఖీ చేయాలన్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లు రిజిస్ట్రేషన్ గడువు తేదీకి నెల ముందు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు రిజిస్ట్రేషన్ గడువు పూర్తయిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖలోని కింగ్ జార్జి ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి సంబంధించి వివిధ అంశాలపై సమీక్షించారు. నియమ, నిబంధనలకు లోబడి అందరూ పని చేయాలని, విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. మంచి పనితీరు కనబరిచి రోగులకు ఉత్తమ సేవలందించాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆధునీకరణ పనుల నేపథ్యంలో రేపు సికింద్రాబాద్-సిల్చార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు చేయనున్నట్లు వాల్తేర్ రైల్వే అధికారులు తెలిపారు. దీంతో పాటు సంబల్‌పూర్ డివిజన్‌లో పలు రైళ్లు దారి మళ్లించి నడపనున్నామన్నారు. అలాగే జూన్ 6 నుంచి 12 వరకు ఎర్నాకుళం-టాటా, జూన్ 7 నుంచి 14 వరకు టాటా-ఎర్నాకుళం రైళ్లు వయా విజయనగరం, ఖుర్ధారోడ్, కటక్, జాఖాపూర, జరోలి మీదుగా దారి మళ్లించనున్నట్లు తలిపారు. ప్రయాణికులు గమనించి ఈ రైళ్ల సేవలు వినియోగించుకోవాలని రైల్వే అధికార్లు కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, వాయువ్య బంగాళాఖాతంలోని కొన్నిప్రాంతాల లోకి విస్తరించాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు రానున్న రెండు మూడు రోజులలో మధ్య అరేబియా సముద్రంలో మరికొన్ని ప్రాంతాల్లోకి , దక్షిణ అరేబియా సముద్రం లోకి విస్తరిస్తాయని పేర్కొంది. ఆంధ్ర ప్రదేశ్ యానంలో దిగువ ట్రోపోఆవరణములో నైరుతి / పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి తెలియచేస్తూ....

(వాయిస్ 35 సెకన్లు )

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లాలో ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. జిల్లాలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, జెఎన్‌టియు ప్రాంగణంలో బొబ్బిలి, విజయనగరం అసెంబ్లీ స్థానాలకు, లెండి ఇంజనీరింగ్ కళాశాలలో చీపురుపల్లి, రాజాం, గజపతినగరం, ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాలకు ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని, అలాగే, జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. అందువల్ల విజయోత్సవాలకు ఎటువంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసివేస్తున్నట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. కొయ్యూరులో 41.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని అధికార వర్గాలు తెలిపాయి. మరో ఐదు రోజుల పాటు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొంటోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోస్టల్ ఇన్స్పెక్టర్ షేక్.అబ్దుల్ రాష్ట్రస్థాయి ఇండియన్ పోస్టల్ అవార్డును అందుకున్నారు. సెట్ ఎడిషన్ అకౌంట్స్ ఓపెనింగ్ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు సబ్ డివిజన్ మొదటి స్థానంలో నిలిచింది. చింతూరు సబ్ డివిజన్ లో ఉన్న పోస్ట్ ఆఫీస్ నుండి అత్యధికంగా ఖాతాలు ప్రారంభింప చేసినందుకు గాను ఆయనకు ఈ అవార్డు లభించింది.

==================================

==================================